# ఐక్య హృదయములు

❋ చల్లా సత్యేంద్రశంకర్ ❋

గణ గణగణగణ .. "అబ్బ! అప్పుడే రెండో బెల్లు కూడా అయింది. ఇంకెంతో టైము లేదు. స్కూలు కూడ పది నిమిషాల ప్రయాణ దూరంలో వుంది. వేళకు వెళ్లక పోతే మాష్టరుకి కోపం వస్తుంది. అయిన ఆలస్యాన్ని ఏదో మాదిరిగా సర్దిచెప్పేస్తాను. ఇహ మాత్రం ఆలస్యం కూడదు.

అమ్మకేమిటో పిచ్చికంగారు. నాకు వయస్సు వచ్చేసిందంటుంది. ఎంతో ఆరాటం ఎంతో భయం. ఇంత భయమయితో ఏలాగోకాని బాబూ ..ఇల్లాటమ్మతో ఏలాగైనా చిక్కులున్నయి. నాన్న చూడు యిపుడేమంత కంగారు అంటాడు. ఎంత దయ, ఎంత విశాల దృష్టి నాన్నకి. అమ్మకే యీకంగారు నా వయస్సులోని వుద్వేగాలను తనే అనుభవిస్తున్నట్లు మహా!

ఈ అబ్బాయి అల్లా చూస్తాడేమిటి బాబు. ఆ కోర చూపులు, ఆ వంకరగా బిగపట్టిన మాతి-ద్రోహి సినిమాలో శివరావు పెదబాబులా వున్నాడు. ఏం చదువు కొన్నాడో గాని అసలా మొహంలో చదువుకొన్న కళేలేదు. ప్రేత కళకు మాత్రం అవతారమూర్తి. ఇతడేలావుంది పెళ్ళి కొమారుడు.

అమ్మకెంత వుత్సాహం! అందమనే దాన్ని అమ్మ బుద్ధి అందుకోలేదా? అమ్మ కసలీ ఆలోచనే వుండి వుండక పోవచ్చు" ఇలా ఆలోచిస్తూ గడియారం వంక చూసింది సరళ. ఇంక ఒక నిమిషం మాత్రమే మూడో బెల్లు నాపు చేసింది. ఇలా అనుకొని ఎవరో పిలుస్తున్నట్లు గబగబా వెళ్లి పోయింది. వీధిలో రిక్షా కేకేసుకొని అందులో బయలుదేరింది.

సరళకు పదహేనవయేడు. ఆమెను చూసిన మొదటి చూపులోనే ముగ్ధులవ్వాలి. ఐదో ఫారం చదువుతూవుంది. సరళ తల్లికి రెండేండ్లయి పుట్టింది సరళకు పెండ్లి చేయవలెననే వుద్దేశం. రెండుమూడు సంబంధము లిప్పటికే వచ్చాయి. వారికి వీరికి కట్నకానుకలలో తేడాలొచ్చి వుండుట జేసి సరళ వివాహ మప్పటికావవలసొచ్చింది.

ఇది నాల్గవ సంబంధము. చాలా పెద్ద ఆస్తి పరులు. ఒక్కగా నొక్క కొడుకు. కట్నం అక్కర లేదట, గాని అందముంటే చాలుట. అసలిక్కడేవుంది పెండ్లికొమరునికి వుండవలసిన లోపాల కీలకం. కట్నాలంటే బెదిరే సర్వమంగళమ్మగారు సరళకీ సంబంధంచేసిన సుఖపడుతుందని ఆశపడింది. అయినింటపుట్టింది, ఐశ్వర్యవంతుడింట పడుతుంది అని ఎంతో సంబరపడింది సర్వమంగళమ్మగారు. కూతురు వివాహ విషయంలో యీమెదే పెత్తనమంతా. అందముంటే డబ్బుండదు, డబ్బుంటే అందముండదు, అనే వుద్దేశాన్ని యీమె పూర్తిగా బలపరుస్తుంది. అయినా అందం కొరుక్కు తింటామా అని కూడ సమాధాన పర్చుకొంది. పక్కింటి సరమ్మగారి సరోజ అందమయిన వానిని చేసుకొని మహాసుఖ పడిందేమిటనే కొన్ని దృష్టాంతాలను కూడ ఆమె చూపగల్గింది.

పెళ్లివారికి మర్యాదలన్ని మర్యాదగా నడిపింది. ఇహ వారు వెళ్తామన్నారు. వెళ్లినవెంటనే తండ్రిగారి అనుమతిని కూడ పొంది వుత్తరంవ్రాయటం తప్ప యింక తనకే యభ్యంతరము లేదని పెండ్లికొడుకు శేషయ్యచెప్పి, తన కాబోయే అత్తగారికి మనసార నమస్కరించి సెలవు తీసుకొన్నాడు.

"త్వరగా తీసుకెళ్లు, ఫస్టుబెల్లుకూడ అయింది" అని రిక్షావాణ్ణి సరళ త్వరపెట్టింది. రిక్షా పరుగెట్టుతూ వుంది "అరె రిక్షా రాయి! రాయి!" అని అరుపు. ఈ అరుపు రిక్షావానిని చేరేసరికి రిక్షా తిరగపడింది. సరళ గాయపడకుండ తప్పించుకుంది. ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు మోహన్. చెల్లా చెదరయిన పుస్తకాలను ప్రోగు చేసి సరళకిచ్చాడు. తనకీయాపత్తు జరుగకముందే తన రిక్షాకు కాపన్నిచ్చిన మోహన్‌నుచూచి సరళ తన కృతజ్ఞత తెలియ పరచకుండ వుండలేక ఒకసారి అతనిలోకి బేలగా చూసింది. అదే

సమయానికి ఆమెలోకి చూస్తున్న మోహన్ కళ్లు ఆమె కనులతో కలిసాయి. "నన్ను గుర్తించుకో" అన్నట్లు మెరిశాయి. సరళ హృదయం ఎందుకో గబగబ కొట్టుకొంది. ఆమె తన మనస్సు మోహన్‌లో విడిచి స్కూల్లోకి వెళ్లింది.

పాఠాలు చెప్పుకుపోతున్నారు మాష్టర్లు. సరళ మనస్సు మాత్రం ఎందుకో దేనికోరకో పరుగెత్తుతూంది. ఏదో మధురతమ ప్రణయాలవలపు చినుకులు చిందులాడాయి ఆమె మనోఫలకంపై.

ఇంటికి తిరిగి వచ్చింది. సర్వమంగళమ్మగారు ఎంతో పుత్సాహంతో తనకూతురును ముద్దుపెట్టుకొంది. తనకూతురే కదా త్వరలో జమీందారిణి అవుతుందని కాబోలు! అవును ఏ తల్లికి మాత్రముండదు తనకూతురు జమీందారుల కోడలవుతుందంటే?

అంతా ప్రశాంతం. చీకటి తన తెరలను మరీ నలుపు చేస్తూంది. మాలతీ, రేరాణులు మధుర వాసనల గుబాళిస్తున్నాయి. పూదోటలు రాబోవు రోజుక్కై ముస్తాబవుతున్నాయి. ప్రకృతి ముగ్ధనారిలా మౌనంగా తనకార్యాన్ని నిర్వహిస్తూంది. అందం, ఐశ్వర్యాల మధ్య సరళ మనసు పెనుగులాడుతుంది. సరళకిదేయేమో రాబోవు జీవన్నాటకానికి నాంది ప్రస్తావన!

"మోహన్ ఎంత పరోపకారబుద్ధిగలవాడు! ఎంత అందం! అందానికి తగ్గ సౌష్టవం కూడ! ఏం చదువుతున్నాడో ఏమో! అవును మరచా. ఆ రోజున పెన్ను తీసుకొందామని అన్న దగ్గరకెళ్ళినప్పుడు బి.ఏ. క్లాసులో కూర్చున్నతడితడే! అన్ని నక్షత్రాలలోనూ చంద్రుడేగా మనకు కాంతి నిచ్చేది! అప్పుడు యధాలాపంగా చూచా. ఇప్పుడతడే పరిచయం చేసుకొన్నాడు. చంద్రుడేగా కుముదముల కొరకై వచ్చేది! ఈ పరిచయంయొక్క అంతిమ సందేశమేమో! ఏమయినా సరే యితడే నా యాశలకు రూపునొసగే నాణెకాడు. ఇతడు నేను జీవితంలో భాగస్థులమవుతే! ఛ! తప్పు, కాదు.

"మనసా! నీవెంత చిలిపిచేష్టకయిన వెఱవవు గదా! అతనెక్కడ నేనెక్కడ? ఈ సంగతి తల్లికి తెలుస్తే కొంపయ్యేదా! తల్లి ఏం చేసినా, ఏం చెప్పినా నేను మాత్రం ఆ శేషయ్యను పెళ్లి చేసుకోను. నేను భారత నారిని. నా ముందు సావిత్రి, దమయంతిలాంటి దివ్య ప్రేమికులున్నారు. నేను వారికి వెనుకబోను. ఆ జమీందారును చేసుకోను. అతడి కోటలో యెన్ని యినుపపెట్టెల ధనమున్నా సరే!" అని సరళ మనస్సు ఒక నిశ్చయాని కొస్తూండగానే ఆమె నిద్రాదేవి ఒడిలో తలదాచుకుంది.

శేషయ్యకు వ్యతిరేకంగాను, మోహన్‌కు అనుకూలంగాను సరళ నిశ్చయించుకున్నదంటే ఆశ్చర్యమేముంది? 'కన్యావరయతే రూపమ్' అంటారుగా మన పూర్వీకులు!

ఆ రోజు సరళ తనకున్న వాటిలో అందమైన దుస్తుల ధరించింది. ఇది ఆమె ఎరుకలో చేసినట్లు తోచదు. సరళ నిజంగా ఆ రోజు మూర్తీభవించిన స్త్రీరత్నం. స్కూలు వైపు నడుస్తూంది.

మోహన్‌కూడ అప్పుడే ఒంటరిగా కాలేజికి బయలు వెడలుచున్నాడు. సరళ అతని కళ్ళ ఎదుట తొలకరి మెఱుపులా మెఱిసింది. కాని యీ మెఱుపు కళ్ళల్లోంచి మనసులో నాటుకొంది. తను ఎరుగకుండానే ఆమెలోకి చూస్తూనే వుండి పోయాడు, ఇది పసుకామ ప్రేరేపణ మాత్రంగాదు. ఆమె నేత్రాల్లో భారత గృహిణుల పరమ పాతివ్రత్యపు అమర గాథల నతడు చదివాడు. మధురానుభూతినొందాడు.

సరళకూడ అతన్ని మనసార చూచింది. అతని మోములోని సత్యప్రకర్ష గంభీరత ఆమె నాకర్షించాయి. మంత్రించాయి ఆ విశాల నేత్రాలు. అతను తన్ని తిరిగి చూచుచుండెనని తెలియుట తోడనే ఆమె సిగ్గుపడింది.

ఆహా! ప్రణయ పురాణంలో నేత్రాల పాత్ర యెంత ఘనమైనది!

* * *

ఏమీ తోచక పోతే సరళ దగ్గరలోనే వుంది కదా అని పార్కుకి వెళ్ళింది. మోహన్‌కూడ అదే స్థితిలో నుండుట జేసి అతనుగూడ ఆ పార్కులో ఒంటరి ప్రదేశంలో కూర్చున్నాడు. సరళ కూడ ప్రశాంతంగా వుంటుంది గదా ఏకాం

తంలో తన ఆలోచనలతో ఒకటై వుండవచ్చునని ఆదే ప్రదేశానికొచ్చింది. మోహన్ ప్రక్క దుబ్బు మాటు నుండుటచే ఎవరూలేరని మూగగా కూర్చుంది. మోహన్‌కు ఎవరో వచ్చి కూర్చున్న వాసన తగులుటచే చకితుడై దుబ్బు సందుల్లోంచి సరళ వైపు పార జూచెను. ఆమె తన కొరకై వచ్చిందనే వూహాలో ఆమెవద్దకొచ్చి చిరపరిచితునివలె ఆసీనుడయ్యెను. కూర్చుని 'నీ పేరేమిటి ?' అని సరళ నడిగెను.

సరళ తెల్లబోయి సిగ్గు పడెను. తను తెలివి తక్కువగా చూసుకోనకుండా కూర్చొన్నందుకు తన్ను తానే మంద లించుకొన్నది. చెదరిన యెదను చేపట్టుకొన లేక వెంటనే సమాధానమీయలేదు.

'నీ పేరేమిటి' అన్న ఆ ప్రశ్నలో ఎంత నిర్మలత, మార్దవంవునాయి ! ఏదో మంత్రం వున్నట్లు అనిపించిందా వూబోణికి !

నిజం, మోహన్ ఆకృతిలోనున్న అందం గొంతులో కూడ వున్నది. ఆ గొంతు తనలోకి ఆకర్షిస్తున్నట్లుం టుంది.

కొంత తరికి తన 'చెదరిన యెద'ను కూడ బట్టుకొని, మృదువుగా స...ర.. ళ అని తనపేరు చెప్పింది.

మనసు కనులను హెచ్చరించింది. తిరిగి చూచుకొన్నాయి ఆ ప్రేమావృత నేత్రాలు. చిరునవ్వు నవ్వినయ్.

ప్రకృతి తన సంతోషాన్ని వెలిబుచ్చుటకేమో తన పిల్ల తెమ్మెరల నా ప్రేమతో వేడెక్కిన హృదయములపై కలి పెను. అపుడే వికసితములయిన 'రే రాణి' పూగుత్తియలు, తామె యీ సందర్భంలో ముత్తయిదువులన్నట్లు కది లాయి. తారకా, శశాంకులు తమ చల్లని కాంతితో సరళా, మోహన్‌ల నాశీర్వదించాయి. ప్రకృతే వీరి ఐక్య జీవితానికి సాక్షి.

★

# సుప్రభాతం

భాషాప్రవీణ శ్రీమతి అ. రాఘవమ్మ

ప్రాగ్దిశాకాంత అకాశ మందిరమున
బాల సూర్యు డన్నిసుగును బడసిమిగుల
మురియు చుండెను బాలెంత ముసుగు వైచి
నీలి మేఘాల నడికట్టు నీడలోన.

నాధు జాడను గని బోలు నవ్వుచుండె
పద్మినీ కాంత పుప్పొడి పసుపు రాసి
తేటి కాటుక లెట్టుక తేనెకాను
కలుగ గొని వచ్చె స్వాగతములుగ నేమొ

రాలుచున్నవి యింకను పూల పొదల
మంచు తుంపురల్ మెలమెల్ల మధుర మగుచు
పద్మినీ కాంత పెండ్లికి పరమశోభ
సురలు గురియించు చుండెడు విరులఁబోలె.

కుహుకుహూ యని కోయిలల్ కూయుచుండు
కూజితంతబుల బాజాలు కొమరు మిగిలె
ఏడు లోకాల నేలు నారేడు విశ్వ
సాక్షి మధుమూర్తి వారి పూజారి యయ్యె.

ఆప్రణవ మూర్తి దివ్య హృదంతరమున
జగతి దేదీప్యమానమై సొగసు గులికె
ఆదివ్యనాధు గాంచి ఆనంద తన్మ
యాత్ములై బయలు దేరిరి అఖిలజనులు.

★